# జ్వలిత స్మృతులు X

రచన :
శ్రీ. కె. వి. రమణ.

"ప్రాలీవాల్ పార్క్"లో ఒక చెట్టుక్రింద కూర్చున్నాను. ఎవరో మెత్తటి పరుపు పరిచనట్లనిపించింది. మధ్యాహ్న సమయం. వానలు వంకల వృక్షసమూహాలు తల లూవుతున్నాయి. రోజంతా ఏకాంతంగా గడిపేయాలని నా హృదయం వాంఛించింది.

నేను గదిలోనే కూర్చుని వున్నట్లయితే ఎవరో ఒకరు వచ్చి నా ఏకాంతాన్ని పాడుచేస్తారనే భయం. అందుచేతనే నేనిక్కడకు రావలసి వచ్చింది.

ఎండ ఏమీలేదు. గగనాన తెలుపు, నలుపు మేఘాలు ఇటూ అటూ పరుగెత్తుతున్నాయి. ప్రియురాలికి సందేశం తీసుకు వెళ్తున్నట్లుగా నాకు తోచింది. కొన్ని పక్షులు ఎగురుతున్నాయి - రెక్కలు చప్పళ్లు చేసికుంటూ, మరికొన్ని చెట్ల ఆకులలో దాగుడు మూతలాడుతూ కలరవం చేస్తున్నాయి.

మలయ మారుతం వీస్తున్నది. నా హృదయం కొద్దిసేపు శాంతించింది. కండ్లు మూసుకుని కొద్దిసేపు యీ సుందర దృశ్యమును మనస్సులో చిత్రించుకుని ఆనందానుభూతిని పొందాను.

ఏ శాంతిని పొందుదామనే ఆశతో నేనిక్కడికి వచ్చానో, ఆ శాంతియే నా హృదయరంగంలో గత స్మృతిని రగుల్కొలిపింది. దానిని మరుద్దామన్నప్పటికీ కూడ మరుపుకు రావటం లేదు.

జీవితంలో యీ దినాన్నే మరచిపోదామని అనుకుంటాను, కాని నావలన కాకుండావుంది. "ఈరోజు", నుండి, గత జ్వలిత స్మృతులనుండి నా మనస్సు దూరంగా పారిపోవాలని ప్రయత్నం చేస్తున్న కొద్దీ, ఈ జ్వలిత స్మృతులు నా మనస్సును వెన్నంటుతున్నాయి.

ఈ సంఘటన నా బాల్యంలో జరిగింది. అప్పుడు నేను మూడో క్లాసు చదువుతున్నాను. అప్పుడు నేను చాల కొంటెవాడిని. ఇంట్లో చాల అల్లరిచేసే వాడిని. మా నాన్నగారు నన్ను చాల కోపపడే వారు, కాని మా అమ్మ నన్ను చాలా గారాబంగా చూసేది.

మేము హైదరాబాదునుండి విజయవాడకు వచ్చేము. మా నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ అయింది. మేము వుంటున్న యింటి కెదురుగా ఒక అందమైన బిల్డింగు వుంది. మా కుటుంబంలో మా అమ్మా, నాన్నా, నేనూ, మా అన్నయ్య మాత్రమే వున్నాము.

ఎదురింట్లో భార్యా భర్తలు, వారి కుమార్తె వుండేవారు. కుమార్తె అంటే చంటిపిల్ల కాదు. అందమైనదీ, యౌవన వతును. వారితో మా పరిచయం అయింది. ఆమె పేరు 'స్నేహలత' ముద్దొచ్చే పేరు. నేనప్పట్లో చాల చిన్నవాడిని, కాని అల్లరి చేయటంలో మాత్రం పెద్దవాడినే. నేనొక నాడు స్నేహలత తల్లిగారి వొడిలో కూర్చుని మా అమ్మతో అన్నాను - "అమ్మా, ఇదిగో మా అత్త" నా మాట విని అందరూ నవ్వసాగారు. మా అత్తగారి మాట చెప్పనే అక్కరలేదు. నా మాటపై ఆమె మంత్ర ముగ్ధురాలయింది. నా బుగ్గలపై ముద్దుల వర్షం కురిపించింది.

మా అన్నయ్య కాలేజీలో చదువుతుండేవాడు. స్త్రీల వాలు చూపులకు గురి అవటానికి చాలమంది అక్కడికి చదువుకోవటానికి వస్తారని నేను విన్నాను.

ఒక రోజున మేమిద్దరము పై అంతస్థు మీదికి వెళ్ళి, పచారు చేస్తూ గాలిని తినసాగాము. కొంతమంది అమ్మాయిలు రోడ్డుమీద వెళ్తున్నారు వాళ్ళను చూచి మా అన్నయ్య యీల వేశాడు. ఆడపిల్లను చూట్టంతోనే హృదయంలో ఆనందం ఉద్భవిస్తుందని అనుకున్నాను. ఈ విధంగా చూచినట్లయితే ఆనందం చూపించటానికి గుర్తు - యీలవేయటం అని వెంటనే నేను కూడ యీల వేశాను. అమ్మాయిలు వాళ్ళ దృష్టుల్ని మాపై విసిరేసి వెళ్ళిపోయారు - కులుకుతూ, వొయ్యారంగా ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ.

తర్వాత చిన్న పిల్లలు అలా చెయ్యకూడదని మా అన్నయ్య నన్ను కోపిచాడు. ఈల వేయటం దురలవాటయి నట్లయితే మా అన్నయ్య ఎందుకు యీలవేసి నట్లు. నేనీ మాట మా అన్నయ్యను అడగలేను. అడిగిన తరువాత నాలుగంటిస్తే?

కిటికీ చువ్వలు పట్టుకుని స్నేహలత తన గదిలో నిలబడి వుంది. అక్కడినుండి మా ప్రక్క చూస్తూ

వుంది. మమ్మల్ని చూసి నవ్వుతూవుంది. మా అన్నయ్య చిరునవ్వు నవ్వాడు, నాకు నవ్వొచ్చింది.

*    *    *

చల్లటి పిల్ల తెమ్మెరలు వీస్తున్నాయి. చిన్న చిన్న నీటిబొట్లు పడుతున్నాయి. నా హృదయంలో నుండి నిట్టూర్పులు వెల్వడలి, ఆకాశంలో మేఘాల రూపంతో విహరిస్తున్నట్లనిపిస్తున్నది. నా నయనాల్లో అశ్రుజలం యింకిపోయింది. కాని ఆ అశ్రుజలమే మేఘాలు వర్షిస్తున్నాయేమో ననిపిస్తున్నది.

వర్షపు తుంపరలు పడుతున్నప్పటికీ కూడ యిక్కడి నుండి లేవబుద్ధి కాలేదు. ఇద్దరు అమ్మాయిలు అప్పుడే ఆగ్రా యూనివర్శిటీలో నుండి పార్కులోనికి వచ్చి నా ఎదురుగా వుండే చెట్టు క్రిందున కూర్చున్నారు. కొన్ని క్షణాల వరకూ నా ప్రక్క చూస్తూ వుండి పోయారు. తర్వాత నా గురించే ననుకుంటాను, వాళ్ళల్లో వాళ్ళు మాట్లాడుకో సాగారు. నాకు వాళ్ళు సీనియర్సో' జూనియర్సో, గుర్తుకు రావటం లేదు. నా హృదయ రంగంలో వుండే ఆశలు ఒక్కొక్కప్పుడు మెరిసి మాయమవుతున్నట్లు నీటి బిందువులు గడ్డి చిగుళ్ళపై పడి ముత్యాల్లా మెరుస్తున్నాయి.

హైదరాబాదులో వుండేటప్పుడు మా యింటి కెదురుగా ఒక కాలేజీ విద్యార్థి వుండేవాడు. నేనొక రోజున అతని గదిలోనికి వెళ్ళాను అతడు ఎంతో శ్రద్ధగా ఏదో లావుపాటి పుస్తకం చదువుతున్నాడు. అతని కళ్ళద్దాలు కూడ లావుపాటివే. వెనకనుండి దగ్గరగా వెళ్ళిచూశాను- అతని పుస్తకంలో ఒక బొమ్మవుంది. అది ఒక అందమైన అమ్మాయిది. పెదవులు విప్పీ విప్పకుండా నవ్వుతున్నది.

నేను అతని భుజాలు పట్టుకుని కుదిపాను. అతడు అదిరి పడ్డాడు. పుస్తకం మూసి వేస్తూ అన్నాడు - "నువ్వా?... ఇక్కడికెందుకు వచ్చావ్?"

"పూరికినే... ఆ బొమ్మ ఎవరిదో చెప్పు."

బొమ్మ మాట వినగానే అతడు అదిరి పడ్డాడు. నేనింతవరకూ ఆ బొమ్మ చూడలేదనుకున్నాడు. "ఎవరి బొమ్మ?" - అనిఅడిగాడు.

"నీ పుస్తకంలో వుండే బొమ్మ - నిన్ను చూచి చిరునవ్వు నవ్వుతోంది."

పుస్తకంలో వుండే బొమ్మ - నేను చూసేశానని అప్పుడు అనుకున్నాడు. అప్పుడతను నాకు బిస్కట్లు యిచ్చాడు, ఇలా అన్నాడు - "పుస్తకం అచ్చు వేసే వాళ్ళు ఆ బొమ్మను అచ్చు వేయడం మరిచి పోయారు, అందుచేత యీ ఫోటో నాకు విడిగా యిచ్చారు."

అక్కడి నుండి వచ్చేస్తున్నప్పుడు నన్ను దగ్గరకు పిలిచి అన్నాడు - ఈ మాట ఎవరితోను చెప్పకద్దు. ఇందులో భయపడవలసిందేమీలేదు. కాని ఇది ఎవరికైనా తెలిస్తే మాత్రం బాగుండదు.

ఈ విధమైన కాలేజీ విద్యార్థులు అమ్మాయిల చిరుదరహాసానికి తమ గుండెల్ని కోసి యివ్వటానికి కూడ సిద్ధంగా వుంటారు.

*    *    *

రోజూ సాయంకాలం మేమిద్దరమూ పై అంతస్థు మీదికి వెళ్ళి పచారు చేస్తుండే వాళ్ళము - కాలేజీ పక్షులు యిళ్ళకు వెళ్ళిపోతుండే సమయంలో. సరిగ్గా అదే సమయానికి స్నేహాలత కిటికీ వద్ద నిల్చుని మా వంక చూస్తుండేది - అప్పుడప్పుడు నవ్వుతుండేది.

రోజులు గడుస్తున్నాయి. ఆసమయంలో జీవితమంటే నాకు నిర్ణీతమైన భావనలు వుండేవికావు. జీవితపు సుఖదుఃఖాలు కూడ నాకు తెలియవు.

ఒక రోజున మా అన్నయ్య నాకు ఒకకవరు యిచ్చి, స్నేహాలత కివ్వమని చెప్పాడు. దాంట్లో ఏముందని కూడ నేను ఆనాడు అడుగలేదు.

నేను తిన్నగా స్నేహలత గదిలోనికి వెళ్ళాను. ఆమె ఏదో పుస్తకం చదవటంలో లీనమయివుంది. ఆకాశం నుండి అప్సర దిగివచ్చిందేమో ననిపించింది. నేను వెనక నుండి ఆ కవరు ఆమె పుస్తకంలో పడేశాను. నన్ను విచిత్రంగా చూసింది - వెనుదిరిగి. ఆమె మౌనంగా వెళ్ళి తలుపులు మూసి లోనుండి గడియ వేసి వచ్చింది.

కవరు తెరిచింది. దానిని చదువుకున్న తరువాత తన నవనీత సమానమైన సుకోమల కరాలతో నన్ను ఎత్తుకుని నా బుగ్గను మధురంగా చుంబించింది. ఆ కవరులో సంతోషమును కలుగచేసే ఏ విచిత్రమైన వస్తువుందని?

నాకు బిస్కట్లు తినిపించింది. కాఫీ యిచ్చింది - త్రాగటానికి. వెళ్ళి పోతున్నప్పుడు ఆమె నాకు మరో కవరు యిచ్చింది - మా అన్నయ్యకు యిమ్మని.

నేను మా అన్నయ్య గదిలోనికి వెళ్ళేసరికి ఏదో వ్యాకులతతో యిటూ అటూ తిరుగుతున్నాడు. నన్ను చూడగానే అడిగాడు - "ఏమిటయ్యింది?"

నేనేమీ మాట్లాడకుండా ఆ కవరును మా అన్నయ్య కిచ్చాను. దానిని విప్పి చదువుకున్నాడు. సంతోషంతో గంతులు వేయసాగాడు. వీళ్ళద్దరూ పిచ్చివాళ్ళయి పోయినట్లు నాకు తోస్తున్నది.

ఈ కవరులో అంత సంతోషమే నిజంగా వునట్లయితే, నాకెవరిస్తారు - అటువంటి కవరును.

* * *

రోజులు గడుస్తున్నాయి. కవర్లు యిచ్చిపుచ్చుకోవటం జరుగుతున్నది. మా అన్నయ్య, స్నేహలతలలో విచిత్రమైన పరివర్తన కనిపించ సాగింది. వారి ముఖాలపై ఏదో చెప్పనలవికాని ఆనందానుభూతి. సాయంకాలం ఎంత అత్యంతవసరమైన పని వున్నా - మేమిద్దరమూ పై అంతస్థు మీదికి వచ్చేవారము మా అన్నయ్య స్నేహలత వైపు ఏకాగ్ర దృష్టితో చాలసేపటి వరకూ చూస్తూ వుండి పోయేవాడు.

అప్పుడప్పుడు మా అన్నయ్య ఏమిటో వర్ణిస్తుండేవాడు నాకు బొత్తిగా అర్థం అయ్యేదికాదు - "చూడు, ఆ పక్షులు ఎంత అందంగా వున్నాయో - ప్రేమగా మాట్లాడుకుంటున్నాయి"

నేనటు చూశాను - చెట్ల కొమ్మలలో, ఆకు పచ్చటి ఆకుల మధ్యన కూర్చుని కలరవం చేస్తున్నవి - నల్లని రంగు పక్షులు.

"అటు చూడు- పడమర వైపు- నీలాకాశంపై లాలిమ వ్యాపించింది. విధాత సింధూరం నలువంకల వెదజల్లినట్లు, నవయువతి బుగ్గల రంగులు పిండి చిత్రకారుడు ఆకాశాన్ని దిద్దినట్లు తోస్తున్నది. ఆకాశంలో దూది లాంటి మేఘాలు పచారు చేస్తున్నాయి - అవికూడ అరుణిమను దాల్చాయి. సుగంధిత మారుతం వీస్తున్నది."

తరచుగా వర్ణనలు యీవిధంగా వుండేవి. స్నేహలత


THE ORIENT LITHO PRESS

P.B No. 17, SIVAKASI (S.I.)

Please keep — ORIENT — in mind for 1964 New Year Superfine Offset Calendars of Uncompromising Quality consisting of 100's of beautiful designs covering a wide range of subjects.

Now available at the lowest price

*The mark of* *fine Calendars*

మాటలు కూడ సాధారణంగా యిలానే వుండేవి.

వీళ్ళు వాగుతున్నదేమిటో నాకు కొద్దిగా కూడ అర్థమయ్యేది కాదు.

ఒకనాడు మేమిద్దరమూ పై అంతస్థుమీద వున్నాము నీళ్ళు తెమ్మని మా అన్నయ్య అన్నాడు.

నాకు ఆశ్చర్యం వేసింది. ఎందుచేతనంటే ఇప్పుడిప్పుడే మేము నీళ్ళుత్రాగి పైకి వచ్చాము. నేను అన్నాను - "ఇప్పుడే కదా మనం నీళ్ళుత్రాగి పైకి వచ్చాము. ఇంత త్వరగా నీకు దాహం ఎందుకు వేస్తున్నట్లు?"

నావైపు కోపంగా చూస్తూ అన్నాడు—'అదంతా నీకెందుకు? త్వరగా పట్రా?'

మా అన్నయ్య మాటలు విని నాకు భయం వేసింది. నేను నీళ్ళు తీసుకరావటానికి క్రిందికి వెళ్ళాను.

కొన్ని క్షణాల తర్వాత నేను నీరు తీసుకుని పైకి వచ్చాను. స్నేహలత ఎక్కడ నిలబడివున్నదో ఆ కిటికీ మూసేసి వుంది. మా అన్నయ్య అన్నాడు—'నీటి అవసరం లేదిప్పుడు. నేను పైకి వెళ్ళుతున్నాను—కొంత అత్యవసరమైన పని వుంది.' ఇలా అని నా మాట వినకుండానే క్రిందికి దిగి వెళ్ళిపోయాడు.

మా అన్నయ్య తాలూకు యీ వింత ప్రవర్తనపై నాకు విస్మయం కలిగింది.

నేను క్రిందికి వెళ్ళి గదిలో నీళ్ళ గ్లాసు పెట్టేశాను. స్నేహలత యింటికి వెళ్ళాను. స్నేహలత బయటకు ఎక్కడికో వెళ్ళిందని మా అత్త చెప్పింది.

మా అత్త, అంటే స్నేహలత తల్లి నన్ను ఎంతో ప్రేమతో తన వొళ్ళో కూర్చోబెట్టుకుంది. బిస్కట్లు యిచ్చింది—తినటానికి. ఆమె ప్రేమగా ముద్దుపెడుతూ అడిగింది—'మా అమ్మాయిని నీవు పెళ్ళి చేసుకుంటావా?'

నేనామాట విని చాల సిగ్గుపడిపోయాను. క్రిందికి చూడసాగాను. ఆమె ఫకాలున నవ్వసాగింది. ఆమె వొళ్ళోనుండి క్రిందికి దూకి, యింటివైపు పరుగెత్తాను.

పెళ్ళి చేసుకుంటే ఏమిటి జరుగుతుందో నాకు తెలియదు. కాని ఒక విషయం మాత్రం తెలుసు—పెళ్ళి అయిన తరువాత భార్య కాళ్ళు పడుతుందని మాత్రం తెలుసు.

విదేశాలలో ఎక్కువమంది భార్యలు వయస్సులో పెద్దవాళ్ళుగానూ, భర్తలు చిన్నవాళ్ళుగానూ వుంటారని నేను విన్నాను. ఈ విషయము మా నాన్నగారు, మా అమ్మగారితో చెప్పుతుండగా విన్నాను. ఆ సమయంలో నేను వారి మంచం క్రిందనే ఉన్నట్లు వారికి తెలియదు.

* * *

ప్రతి రోజూ సాయంకాలం ఫలహారం అయిన తరువాత మా అన్నయ్య షికారుకు వెళ్ళసాగాడు—నన్ను తీసుకవెళ్ళకుండా.

చదవటం కూడ మానేశాడు. అప్పుడప్పుడు చదవబుద్ధేస్తే చదువుతాడు. అంతకుముందు మాత్రం రాత్రి చాలసేపటివరకు చదివేవాడు. నా తల్లి దండ్రులు అతని చదువు చూసి మనస్సులో ఎంతో ఆనందించేవారు. రాత్రి ఎక్కువసేపు చదివినట్లయితే ఆరోగ్యం పాడవుతుందని మరొకప్రక్క హెచ్చరిస్తుండేవారు.

గదిలో ఒంటరిగా కూర్చుని ఏదో వకటి ఆలోచిస్తూ వుండేవాడు. కాగితాలపై పిచ్చి గీతలు గీస్తుండేవాడు నేను గదిలోనికి వెళ్ళటంకూడ అతనికి నచ్చేదికాదు.

నేనప్పుడప్పుడు ఆలోచించేవాడిని—'మా అన్నయ్యకేమిటయిందని?'

ఒకనాటి సంగతి—ఉదయం పదిగంటలయింది. మా నాన్నగారు ఆఫీసుకు వెళ్ళిపోయారు. నేనారోజున స్కూలుకు వెళ్ళలేదు. నన్ను మా అన్నయ్య తన గదిలోనికి పిలిచాడు. ఒక కవరిచ్చి స్నేహలత కిమ్మని చెప్పాడు.

నేను దానిని తీసుకుని అక్కడికి వెళ్ళాను. నా చేతిలోని యీ వుత్తరం చూచి మా అత్త అడిగింది—'ఏమిటది?'

నేను చెప్పాను—'మా అన్నయ్య దీనిని స్నేహలతకిమ్మని యిచ్చాడు.'

ఈ మాట వినగానే ఆమె ఆశ్చర్యపడ్డట్టు నాకు అనిపించింది. కొంతసేపు ఆలోచించిన తరువాత ఆమె అంది—'స్నేహలత యింట్లో లేదు. ఆమె వచ్చింతరువాత యిస్తాను ఆ కవరు యిలా యివ్వు.'

ఆ కవరు ఆమె చేతికిచ్చి యింటికి తిరిగి వచ్చాను. మా అన్నయ్య ఏమిటయిందని అడిగాడు. నేను జరిగిన విషయమంతా చెప్పాను.

ఆ మాటలు వినగానే పిచ్చివాడిలా అయిపోయాడు. వ్యాకులతతో గదిలో యిటూ అటూ పచారు చేయసాగాడు. అతడికేమయిందో తెలియదు మధ్య మధ్య నన్ను తిట్టసాగాడు.

బట్టలు వేసుకుని మా అన్నయ్య బయటకు వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం మా అత్త మా యింటికి వచ్చింది. మా అమ్మ, ఆమె ఏవేవో మాట్లాడుకుంటున్నారు. గుసగుసలాడుకుంటున్నారు. నేను వారిదగ్గరకు వెళ్ళాను. మా అమ్మ నన్ను చూసి ఆడుకోవటానికి వెళ్ళమని చెప్పింది. అక్కడ కూర్చుంటానని పట్టుపట్టాను. కాని మా అమ్మ గద్దించటంచేత, భయపడి అక్కడినుండి బయటకు వచ్చేశాను.

సాయంకాలం మా నాన్నగారు ఆఫీసునుండి తిరిగి వచ్చారు. టీ త్రాగిన తరువాత నన్ను దగ్గరకు పిలిచి అడిగారు—'ఎప్పట్నుంచీ యీ కవర్లు నీవు స్నేహాలతకు యిస్తున్నావు?'

నేను జరిగిన సంగతులన్నీ ఉన్నవి ఉన్నట్టు చెప్పాను. ఆయనకు చాల కోపం వచ్చింది. బెత్తం తీసుకుని నాలుగు వేశారు. నన్ను రక్షించటానికి మా అమ్మ మధ్యకు వచ్చింది. ఆమెకో రెండు తగిలాయి నేను గట్టిగా ఏడ్వసాగాను. మా అమ్మ నన్ను లోనికి తీసుకవెళ్ళిపోయింది.

ఉదయం అనగా వెళ్ళిపోయాడు. ఇంతవరకూ మా అన్నయ్య జాడే లేదు.

నేను మొదట అనుకున్నాను—ఈ కవరులో సంతోషమే వుంది. కాని యిప్పుడు దీనిలో దుఃఖంకూడ వున్నదని తెలిసింది. మాలో ఎవరమూకూడ భోజనము చెయ్యలేదు. ఆకలి - దుఃఖము మధ్యలో నేను నిద్రపోయాను నేను ఒక కల గన్నాను—మా అన్నయ్య గులాబీలతో నిండిన మార్గంగుండా ముళ్ళను తప్పించుకుంటూ ఎక్కడికో వెళ్ళిపోతున్నాడు.

(తరువాయి 78వ పేజీలో)

Grams: "MEDALSOAP" P. B. No. 21 Phone No: 30




మీ అందమైన బట్టలను వుతుకుటకు ....

'రాయల్' సబ్బునే వాడండి!

-: అవి :-

* బజారులో అత్యంత ప్రసిద్ధమైనది.
* ధనవంతులూ—పేదలూ అత్యధికముగా వుపయోగిస్తున్నారు.
* సిల్కు - నయ్లాన్ - లెనిన్ మొదలైన ఖరీదైన బట్టలను కూడా "రాయల్" సబ్బుతో వుతకవచ్చును.




బార్ సబ్బు

తయారించువారు

THE PREMIER SOAP INDUSTRIES

P. B. No: 21 :: PERNAMBUT (N.A.)